



పిడిఎఫ్ నుంచి పట్టభద్రుల స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న పోతుల నాగరాజు



కోలాహలంగా...

పీడీఎఫ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు



పిడిఎఫ్ నుంచి ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న కత్తి నరసింహారెడ్డి



నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి

- భారీగా తరలొచ్చిన మద్దతుదారులు
- గుత్తి రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదాం
- ముఖ్యమంత్రి మాటా తప్పాడు...మడమా తిప్పాడు...
- ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ (ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజులు బుధవారం నాడు అభిమానులు, మద్దతుదారుల కోలాహలం నడుమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ గేయానంద్, జల్లివిల్సన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. గుత్తిరోడ్డులోని చలమారెడ్డి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపిచాలన్నారు. మాట తప్పను.. మడమ తిప్పను .. అన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్కమాటను నిలుపుకోలేదని చెప్పారు. ఆయన మాటా తప్పాడు...మడమా తిప్పాడూ అని ఎద్దేవా చేశారు. చట్ట సభల్లో ప్రజా సమస్యలపై ఇప్పుడు చర్చ జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. అవి బూతుల సభలాగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని గుర్తు చేశారు. ఈ బలాన్ని మరింత పెంచే విధంగా ఇక్కడికొచ్చిన ప్రజాసంఘాలన్నీ కలిసి పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించగలం అన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ మండలి ఎన్నికలు కౌరవులు, పాండవులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించేందుకు అధికారపార్టీ సాయశక్తులను ఒడ్డుతోందని చెప్పారు. దీన్ని ప్రజా సంఘాల ఐక్య బలంతో తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఇన్ని ప్రజాసంఘాలు వచ్చి తమ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతోనే తమకు నైతిక విజయం లభించినట్టయిందన్నారు. అధికార వైసిపి ఈ ఎన్నికల్లో ఏదో రకంగా గెలుపొందేందుకు సర్వశక్తులు ఒడ్డుతోందన్నారు. కొంతమంది అధికారులను ఇక్కడికి పంపి ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే చేస్తోందన్నారు. దీన్ని ప్రజా సంఘాల నాయకులు తిప్పికట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలకు సమయం తక్కువగానున్న సమయంలో మరింత అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. ఈ సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పటికప్పుడు మండలిలో పోరాటం సాగించామని గుర్తుచేశారు. సిపిఎస్‌పైనా, పిఆర్‌సిపైనా మండలిలో గొంతెత్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఈ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్టీయు, ఐద్వా, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు



నామినేషన్‌కు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, పిడిఎఫ్ మద్దతుదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఉద్యోగుల ముఖహాజరు తప్పనిసరి

కలెక్టర్ బసంత్‌కుమార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల ముఖ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి కార్యదర్శి ముత్యాల రాజు సిఎఫ్ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ ఆధారిత హాజరుపై వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ బసంత కుమార్, అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డిఆర్ఒ కొండయ్య, సంబంధిత జిల్లా అధికారు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు అమలులో భాగంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదు కాకుండా ఇంక మిగిలి ఉన్న ఉద్యోగులు అందరూ సత్వరమే ఆ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీని బాధ్యతను సంబంధిత డిడిఒలు తీసుకోవాలన్నారు. ఎక్కువ సిబ్బంది ఉన్న శాఖలు జిల్లా పంచాయితీ అధికారి, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్, మున్సిపల్ శాఖ, అటవీ శాఖ, రెవెన్యూ తదితర శాఖలు ఈ అంశంపై ప్రత్యేక దష్టి సారించి పూర్తి చేయాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు యాప్ నందు నమోదు మరియు హాజరు 80 శాతం శాఖలలో పూర్తి అయిందని, దానిని వంద శాతం తప్పక అమలు చేయాలన్నారు. సిబ్బంది అందరూ ఉదయం సాయంత్రం ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలని తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉంటే ఎన్ఐసి సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ సమీక్షలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ విజయ్ కుమార్, డ్వామా పీడీ రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉండాలి
- జిల్లా స్థాయి నేర సమీక్షలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ పని చేయాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ సిబ్బందికి సూచించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎస్ఐలు ఆపైస్థాయి అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన కేసులు, పోలీసు శాఖ తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితుల అరెస్టుల విషయంలో నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌ల అణచివేకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే స్పందన పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించి వారి సమస్య పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని తెలిపారు. కీలక కేసుల్లో ఘటనా స్థలంలోని ఆధారాలు సక్రమంగా, శాస్త్రీయ పద్ధతులలో సేకరించి దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలన్నారు. కేసుల ఛేదింపులో సాంకేతికతను విరివిగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కెవి.రామకష్ణ ప్రసాద్, డీఎస్పీలు ఉమామహేశ్వర రెడ్డి, యశ్వంత్, భవ్యకిషోర్, హుస్సేన్ పీరాతో పాటు జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

పేదకుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పేద యువతి వివాహానికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ తనవంతు సాయం అందజేశారు. ఎన్‌పి కుంట మండలానికి చెందిన టీ స్టాల్ కరీం తన కుమార్తె వివాహానికి బత్తల హరిప్రసాద్‌ను సాయం కోరాడు. స్పందించిన ఆయన బత్తల యువసేన ద్వారా 10 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తల యువసేన నాయకులు ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బత్తల యువసేన నాయకులు

పన్నుల వసూళ్లు వందశాతం చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా అధికారులందరు కలిసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం సచివాలయాల నోడల్ అధికారులతో ఇంటి, నీటి పన్నుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు మార్చి 15 నాటికి 100 శాతం పన్నులను వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికారులు పని చేయాలన్నారు. నీటి పన్ను వసూలు చేయడంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. పెద్ద మొత్తంలో పన్ను చెల్లించే వారికి పార్ట్ పేమెంట్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవిన్యూ అధికారి రంగరావు, ఎసిపి ఆనంద్ కుమార్, ఇన్‌ఛార్జి ఎంఇ నీరజ, ఆర్ఐ రాము, లోకేష్, సచివాలయ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి



ప్రతిభా విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

నేటి యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు చెప్పారు.. బుధవారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర అనంతపురం వారి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి-20, సదస్సుకు సంబంధించి వసుదైవ కుటుంబకం (ఒకే భూమి ఒకే కుటుంబం ఒకటే భవిష్యత్తు అనే నినాదం) గురించి, యువత స్కిల్స్, లేబర్ వెల్ఫేర్, బేటి బచావో బేటి పడావో, ఉమెన్ అర్బన్ డెవలప్మెంట్, స్టార్ట్ అప్ ఇండియా, హెల్త్, డిజిటల్ ఇండియా ఎడ్యుకేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు, వాటి అమలు, ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు ప్రపంచంలో ఏ దేశాంలోను లేని యువశక్తి మన దేశంలో ఉందన్నారు. యువశక్తినీ రాజకీయాలలో, ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశ నిర్మాణానికి ఉపయోగిస్తే దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర పోగ్రాం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, సప్తగిరి ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ పండితులు డాక్టర్ ఎం యశోదా దేవి, సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, అడ్వకేట్ డి శివశంకర్, ఎన్‌బిసిసి కోఆర్డినేటర్ సి మహేష్, జీవనజ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు నాగజ్యోతి, జన జాగృతి సొసైటీ వ్యవస్థాపకులు వెంకటేష్ వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల కేటాయింపుపై వాల్మీకుల హర్షం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాల్మీకులను గుర్తించి స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీల పదవులు కేటాయించడ హర్షనీయమని వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి శంకర్ ఎల్లప్ప పెయింటర్ కేశవులు, ఆవుల రాము అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మ, కర్నూలు జిల్లాకు చెందిన డాక్టర్ మధుసూదన్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, మురళి అశ్వర్థ, కిష్టప్ప, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి హబ్‌గా ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

దేశంలోనే సామాజిక న్యాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్‌ను హబ్‌గా మార్చిన సామాజిక విప్లవకారుడిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేరు నిలచిపోతుందని వైసిపి హిందూపురం ఇన్‌ఛార్జి ఇక్బాల్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60శాతానికి పైగా ఎమ్మెల్సీ పదవులు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు కేటాయించారన్నారు. తాజాగా 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బిసిలకే కేటాయించారన్నారు. బిసిలు అంటే వైసిపికి బ్యాక్ బోన్ అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, మణి, పరుశురాం, వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసులు, ఇలియాజ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు ఒక్కఅడుగుతోనే ప్రారంభం

ప్రజాశక్తి బత్తలపల్లి

ఎక్కడైనా ఎప్పుడైనా మార్పు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని.. ఆ అడుగు ఇప్పుడు లోకేష్ వేశారని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పరిటాల శ్రీరామ్ పర్యటించారు. మండలంలోని గరిశనపల్లి, దంపెట్ల, చెర్లోపల్లి, ఓబులాపురం, సంగాల పంచాయతీల్లో శ్రీరామ్ పర్యటించి స్థానికంగా ఉన్న నాయకులతో సమావేశమయ్యారు. ప్రధానంగా నారా లోకేష్ పాదయాత్రపై పార్టీ శ్రేణులను సన్నద్ధం చేశారు. లోకేష్ ప్రజల కోసం ఆయన కుటుంబాన్ని సైతం పక్కన పెట్టి యాత్ర చేస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో ఆయనకు మరింత స్థైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెలలో జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు యాత్రకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సురేంద్ర నాయుడు, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి రవీంద్ర, పోతలయ్య, సుబ్బరాయుడు, జగ్గ, నాగభూషణ, రామ్మోహన్ రెడ్డి, నారాయణస్వామి, కేశవ, వెంకటరాముడు, శివయ్య, శేఖర్, దామోదర, చౌదరి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, ఉమాపతి, సోమిరెడ్డి, సూరి, గనేవలి, ఉస్కేరప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

నైపుణ్యంతోనే యువతకు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి -పెనుకొండ

నిరుద్యోగ యువత కియా ఇండియా అందించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పెనుకొండ మండలంలోని దుద్దెబండ క్రాస్‌లోని కియా ఇండియా ట్రైనింగ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న కియా ఇండియా ఆటో సర్వీస్ టెక్నీషియన్ పోగ్రాంను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ, లీగల్ హెచ్ఒడి యోంగిల్‌మా, టిఅండ్‌డి హెచ్‌ఒడి బైంగిహన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. జిల్లాలో ఉన్న ముఖ్యమైన పరిశ్రమలలో కియా ఇండియా ఒకటి అన్నారు. ఇక్కడ శిక్షణ అందించేందుకు కోసం మంచి ఫ్యాకల్టీ, ల్యాబ్ అటాచ్డ్ ఉండే క్లాస్ రూములు ఉన్నాయన్నారు. ఇక్కడ శిక్షణ పొంది సరైన నైపుణ్యాలు నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా కూడా పనిచేసేందుకు వీలు కలుగుతుందన్నారు. నిరుద్యోగ యువత నైపుణ్యాలలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధి గాయత్రి వాసుదేవన్, తహశీల్దార్ స్వర్ణలత, నిరుద్యోగ యువత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com





నామినేషన్ దాఖలు చేస్తున్న వైసిపి, టిడిపి అభ్యర్థులు, నాయకులు

ఆఖరి రోజు వెల్లువెత్తిన నామినేషన్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆఖరి రోజు శాసనమండలి ఎన్నికలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఉపాధ్యాయ, పట్టభద్రులతోపాటు, స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి అన్ని రాజకీయపార్టీలు అట్టహాసంగా నామినేషన్ల దాఖలు చేశాయి. వైసిపి పట్టభద్రుల నియోజకవర్గానికి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గానికి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల మండలికి మంగమ్మలు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు జిల్లా మంత్రి ఉషచరణ్‌శ్రీ, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. టిడిపి అభ్యర్థిగా రామగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పిడిఎఫ్ తరుపున పట్టభద్రులకు పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఆఖరి రోజు 46 నామినేషన్లు దాఖలయ్యాయి.

మెస్ ఛార్జీలు పెంచాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-హిందూపురం

పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. నెలకు రూ.2500 ఇవ్వాలన్నారు. బుధవారం పట్టణంలోని బిసి కళాశాల వసతిగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు 3, 4 తరగతులకు రూ.1150, 5 నుంచి 10వ తరగతులకు రూ.1400, ఇంటర్ ఆ పై చదువులు విద్యార్థులకు రూ.1600 పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బయట ధరలు చూస్తుంటే ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. దానికి అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలన్నారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, జస్వంత్, బాబా ఫక్రుద్దీన్, వీరేష్, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



విజేత జట్టుతో మాజీ మంత్రి, తదితరులు

టోర్నీ విజేతకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి మడకశిర రూరల్

పది రోజులుగా మండల పరిధిలోని సి కొడిగేపల్లి గ్రామంలో కంపెనీ సెక్రటరీ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైఎస్ఆర్ టి-10 మెమోరియల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో మడకశిర ఎంటీఎస్ జట్టు, రొళ్ల ఫ్రెండ్స్ జట్టుపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం టోర్నీ నిర్వాహకుడు సురేష్ రెడ్డిని క్రీడాకారులు శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కవిత అనిల్ కుమార్ రెడ్డి, చిలమత్తూరు సర్పంచి రామచంద్ర రెడ్డి, నాయకులు శాలిని సుధాకర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, చెరుకూరు సర్పంచి శేఖర్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, చిన్న నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రం గ్రామంలో చోరీ

లేపాక్షి : మండలం పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో మంగళవారం రాత్రి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. నాగరాజు కర్నాటకలోని విధురా అశ్వర్థంలో జరిగే వివాహానికి వెళ్లగా గమనించిన దుండగులు ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. వాకిలి పగలగొట్టి ఇంటిలో ఉన్న రెండు ఉంగరాలు, జత కమ్మలు, మాటీలతో పాటు ఇరవై వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళను కాపాడిన పోలీసులు

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను వన్ టౌన్ పోలీసులు కాపాడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపిన వివరాలు... తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మజీర మండలానికి చెందిన కంసల కావ్య బుధవారం తన పిల్లలు బన్ని, అప్పుతో కలిసి ధర్మవరం రైల్వేస్టేషన్‌కు వచ్చింది. కుటుంబంలో ఆస్తితగాదా విషయంలో గొడవ పడి ధర్మవరానికి వచ్చిన ఆమె పిల్లలను ప్లాట్‌ఫాంపై కుర్చోబెట్టింది. రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసుకోవాలని వెళ్లింది. ఇది గమనించిన ఆమె కుమారుడు తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ నుంచి 100కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు హుటాహుటీన రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని భావ్యను, ఆమె పిల్లలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆమెకుకౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి వారి స్వగ్రామానికి పంపించినటుల సిఐ తెలిపారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండండి

ధర్మవరం టౌన్ : చెడువ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని బిఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఉమాపతి, ఎఎస్ఐ పుత్తప్ప సూచించారు. స్థానిక బీఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు చెడు వ్యసనాలు, ఆకతాయిలతో స్నేహం చేయడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుక్తవయస్సులో చెడువ్యసనాలు, ఆకతాయిలతో స్నేహాలను పెంచుకోవడం వల్ల జీవితాలు పెడతొవన పడతాయన్నారు. ప్రతి విద్యార్థి చదువుపైనే శ్రద్ధ పెంచుకోవడంతోపాటు పెద్దల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు హేమతల, మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

బుక్కపట్నం : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని శాస్త్రీయ దృష్టిని, పరిశోధన విధానాలను అలవర్చుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెవివి జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని పరిశోధనా అలవాట్లను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మహిళా సాధికారికతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్ నాయక్, జిల్లా కోశాధికారి లక్ష్మనాయక్, సమతా జిల్లా కన్వీనర్ సంధ్యారాణి, అధ్యాపకులు హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు తనిఖీ

రొద్దం : మండలంలోని ఆర్. మరువపల్లిలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌ను లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్, తహశీల్దార్ అనంతచారి, ఎఎస్ఒ ప్రభావతి, సిఎస్‌డిటి పోతన్న, సివిల్ సప్లై సిఒ అశోక్ తదితరులు ఈ తనిఖీలో పాల్గొన్నారు.



పెట్రోల్ నాణ్యత పరిశీలన

ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లాలో పనిచేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ బసంత్‌కుమార్‌కు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు వారు బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్‌కు అందజేశారు. అంతకుమునుపు శ్రీ సత్య సాయి జిల్లా తొలి సమావేశం జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిక అధికారిని జిల్లా సమావేశ మందిరంలో నిర్వహించారు. కొత్తగా జిల్లా ఏర్పడి ఉద్యోగులు మధ్యంతరంగా బదిలీ కావటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఉద్యోగులు ఎక్కువ శాతం అనంతపురం జిల్లా కేంద్రం నుండి పుట్టపర్తికి వస్తున్నారని వారికి అనుకూలంగా ధర్మవరం నుండి విజయవాడ వెళేల రైలును పుట్టపర్తి వరకు పొడిగించేందుకు ప్రభుత్వం అనుమతులు తీసుకోవాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగుల ప్రొహిబిషన్, ఎఎన్ఎంల సమస్యలను చర్చించారు. పనిభారం ఎక్కువగా ఉందని ఈ నేపథ్యలో రెండవ శనివారం సెలవు గురించి ఆలోచించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమస్యల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అనంతరం ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యేను కలసి తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఎ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కోశాధికారి కెవి నారాయణరెడ్డి, రమేష్ బాబు, చెన్నారెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ లా నేస్తం కింద జిల్లాలో 20 మందికి లబ్ధి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వైఎస్ఆర్ లా నేస్తం కింద జిల్లాలో 20 మంది యువ అడ్వకేట్లకు రూ. 15.35 లక్షల లబ్ధి చేకూరిందని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఈ పథకం కింద 2022 సంవత్సరానికి అర్హులైన యువ న్యాయవాదులకు పీడీ నరసయ్య మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వత్తిలో ప్రవేశించిన న్యాయవాదులు వృత్తిలో స్థిరపడేవరకు మొదటి మూడు సంవత్సరాల పాటు నెలకు రూ. 5 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ అభివృద్ధి అధికారి శివారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న పీడీ

నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

కదిరి టౌన్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అనంతపురంలో చేపట్టిన నామినేషన్ కార్యక్రమానికి కదిరి నియోజకవర్గం నుండి ప్రజా సంఘాల నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిపిఎం కార్యదర్శి జిఎల్ నరసింహులు ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన

ధర్మవరం టౌన్ : గుత్తి నుండి ధర్మవరం వరకు జరుగుతున్న డబ్లింగ్ రైల్వే ప్రాజెక్టు పనులను సౌత్ సెంట్రల్ జోన్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ ప్రణిజీవ్ సక్సేనా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే విభాగాలకు సంబంధించిన గుంతకల్ జంక్షన్ నుంచి వివిధ విభాగాల రైల్వే అధికారులతో పాటు స్థానిక రైల్వే అధికారులు ఆయనకు స్వాగతంపలికారు. అనంతరం ధర్మవరం రైల్వేస్టేషను పరిశీలిచిన ఆయన మోటార్ ట్రాలీలో చిగిచెర్ల నుండి ధర్మవరం వరకు జరిగిన డబుల్ లైన్ పనులను పరిశీలించారు. అనంతరం ధర్మవరంలో వివిధ విభాగాల కార్యాలయాలతో పాటు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం, సేఫ్టీ పనులపై కూడా దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమలో డివిజనల్ రైల్వే మేనేజర్ కెవిరెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లకు సంబంధించిన వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జడ్జికి సన్మానం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణానికి చెందిన ఉమర్ ఫరూక్ చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి కోర్టు నూతన జడ్జీగా గురువారం బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా ధర్మవరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం స్థానిక కోర్టులో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్‌అధ్యక్షుడు సురేశ్ చౌదరి, కార్యదర్శి దస్తగిరి, ఉపాధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ ఉమర్ ఫరూక్ ఇటీవల జరిగిన జడ్జి పరీక్షలలో ప్రతిభ కనబరచి చిజడ్జిగా గురువారం బాధ్యతలను స్వీకరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

రెండురోజుల్లో విద్యుత్ సమస్య పరిష్కారం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ద్వారకామయి నగర్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకర్ హామీ ఇచ్చారు. కాలనీవాసులు విద్యుత్‌సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేకపోవడంతో బుధవారం ఆ కార్యాలయం ముట్టడించి నిరసన తెలియజేశారు. సమాచారం అందుకున్న డిఇఇ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు నిరసన విరమించారు.

వైభవంగా చిన్న రథోత్సవం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి హెంజేరు శిద్దేశ్వర స్వామి చిన్న రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. .ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

గోరంట్ల : వ్యవసాయరంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్న డిమాండ్‌తో మండలంలోని బూదిలి గ్రామ రైతులు బుధవారం బూదిలి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు పగటిపూట విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో పంటలకు నీరందించలేకపోతున్నామని వాపోయారు. అంతరాయం లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మంజునాథ, శ్రీరాములు, రవిగౌడ్, చంద్ర, జియావుల్లా శంకర తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని వినతి

కొత్తచెరువు : బీసీ కాలనీ సమీపంలోని వేణుగోపాల నగర్‌లో డ్రైనేజీని ఏర్పాటు చేయాలని ఆకాలనీ వాసులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో సిద్ధారెడ్డికి సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని ఇళ్ల నుండి వచ్చే మురుగునీరు ఇళ్ల ముందరే నిలువ ఉండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందన్నారు.సమస్యలను పలుమార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రయినేజీని ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

ప్రముఖ సినీ నటులు నందమూరి తారకరత్న 40వ జయంతిని పురస్కరించుకుని తారకరత్న మిత్రుడు అవుకు హరి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలోని వందమంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవుకు హరి మాట్లాడుతూ నందమూరి తారకరత్న తనకు మంచి మిత్రుడని అన్నారు. ఈ కార్యక్రమంలో తారకరత్న అభిమానులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల కోసం గోడౌన్ల పరిశీలన

కొత్తచెరువు : 2024లో జరిగే శాసనసభ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఇవిఎంలు నిలువ ఉంచడానికి స్థానిక మార్కెట్ యార్డ్‌లోని గౌడౌన్లను జాయింట్ కలెక్టర్ చేతన్, ఆర్‌డిఒ భాగ్యరేఖ బుధవారం పరిశీలించారు. నూతనంగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడినందున జిల్లావ్యాప్తంగా జరిగే ఎన్నికల అనంతరం ఇవిఎంలు భద్రపరచడానికి వాటినిపరిశీలించారు. ఈ గోడౌన్‌ను మరమ్మతులు నిర్వహించి తమకు అప్పగించాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి, సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారికి పరామర్శ

రొద్దం : పెనుగొండ మండలం కురబండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో వేడినీటి పాత్రలో పడిన మూడేళ్ల చిన్నారి వెన్నెల తీవ్రంగా గాయపడింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు అనిత, మురళి హిందూపురం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకొన్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వైద్యఖర్చుల నిమిత్తం 12వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, సాయికిరణ్, జిల్లా అధికార ప్రతినిధి హరీష్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -పెనుకొండ

షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ విదేశీ వైద్యులచే చెవి, ముక్కు, గొంతు, చర్మ సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా విదేశీ వైద్యులతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. దాదాపు 200 వరకు వినికిడి పరికరాలను తెప్పించామని అవసరమైన ప్రతి ఒక్కరికి వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు. సాయి కాళేశ్వర్ వర్ధంతి సందర్భంగా అన్ని అనుకూలిస్తే నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రితో పాటు దంత వైద్యశాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 26వ తేదీ వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జర్మనీకి చెందిన వైద్యులతో పాటు ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రం తనిఖీ

సోమందేపల్లి : మండల కేంద్రంలోని నక్కలగుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ చేతన్ బుధవారం సందర్శించారు. కేంద్రానికి రావడానికి రహదారి సౌకర్యం సరిగా లేదని వెంటనే రహదారి సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కొల్లప్ప, తహశీల్దార్ మురళీకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, వీఆర్వో అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రొద్దం : మండలంలోని పెద్ద గువ్వలపల్లిలో వైస్ ఎంపీపీ హరిత లక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్ వెంకటరమణ బుధవారం కంటి చికిత్స లు చేపట్టారు. ఈ సందర్భంగా 30మంది వరకు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజినరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి కదిరి టౌన్

పట్టణంలోని కాలేజీ సర్కిల్ నందు స్పందన మిత్ర ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎపిఎం శారద మాట్లాడుతూ పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి తద్వారా ఎంతోమంది మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తున్న స్పందన మిత్ర సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన మిత్ర మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీదేవి, ఎవిపి సత్య ప్రకాష్, బ్రాంచ్ మేనేజర్ చిరంజీవి, ఉమాదేవి మంజుల తదితరులు పాల్గొన్నారు

పార్టీకి పూర్వ వైభవం తెద్దాం : కందికుంట



తనకల్లులో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

తనకల్లు : వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేద్దామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్ఎం ఎన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన మండలస్థాయి టిడిపి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికి వదిలి సైకోలా వ్యవహరిస్తూ పాలనను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలని, పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచకాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం వాలెంటీర్ల చేత ప్రజలను బెదిరిస్తూ గృహసారథుల పేరిట మరికొంతమందిని నియమించి తెలుగుదేశం పార్టీకి చెందిన ఓటర్లను బెదిరించడానికి, వినకపోతే ఓటర్లను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాటిని అడ్డుకోవడానికి బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలకు ఎటువంటి సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అబ్జర్వర్ నాగేంద్ర బాబు, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బీగం శంకర్ నాయుడు, మునెప్ప, బడా రాజారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు దేశాయి ప్రభాకర్ రెడ్డి, దేశాయ్ హరినాథ్ రెడ్డి, సోంపాలెం నాగభూషణ, కుంచె నాగేంద్రప్రసాద్, తోట సరోజమ్మతో పాటు వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు బూత్ స్థాయి నుండి ప్రతిష్టాత్మకంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుదామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి స్వర్ణ సుధా ఫంక్షన్ హాల్‌లో టిడిపి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కందికుంట మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, పరిశీలకులు మోపురిశెట్టి చంద్రశేఖర, తెలుగు యువత హరి, గంగులప్ప, వడ్డే బాబు, మండల ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.